# "చరిత్ర పునరావృతమవదు!"

**కే**శవరావు ఎంత చెప్పినా వినలేదు వినడు. కారణమేమిటా అని ఎంత ఆలోచించినా తెగటం లేదు. పోనీ నేను నమ్మేదాంట్లో లోపాలేమైనా వున్నాయేమోనని తరిచి తరిచి చూసుకున్నాను. కాని అటువంటి దేమీ జరగలేదు.

నా దృఢమైన నమ్మకం ఏమిటంటే– చరిత్ర పునరావృతం కాదని. నేను చదివిన సిద్ధాంతాలు దాన్ని బలర్చేవి.

"చాలా మంది చరిత్ర ఏదో వృత్తంలోపలే తిరుగుతుందనుకుంటారు. పాత రోజులు మళ్ళీ వొస్తాయని నమ్ముతారు. కాని అది అబద్ధం. చరిత్ర పునరావృతమవదు. ఒక స్పైరల్ లోపలో మెలికలు తిరిగి వున్నత పదాలకి చరిత్రతగుగమనం సాగిస్తుంది" అనేది నా వాదన.

"కాదు. చరిత్ర పునరావృతమౌతుంది. మనం పాతరాతి యుగానికి ఏనాడో పోక తప్పదు" అని అతను మరింత బలంగా వాదించే వాడు. ఆ మాటలు చెప్పేటప్పుడు కళ్లలో ఒక విధమైన వెలుగు, నేను మొదట అర్థం చేసుకోలేకపోయినది, కన్పించేది. అతి గాంభీర్యంగా మాట్లాడేవాడు.

నా వాదనని బలపర్చుకునేందుకు మనం ప్రిమిటివ్ సామ్యవాద స్థితి మొదలుకొని, భూస్వామ్య పెట్టుబడిదారి వర్గస్థితికి, సామ్రాజ్యవాదంనించి సోషలిజం వైపు ఎట్లా నడుస్తున్నా మా నిరూపణలతో చెప్పేవాణ్ణి.

పురాతన కాలంనాటి స్థితిగతులకి సంఘాన్ని దేశాన్ని నడుపుదామనుకోవడం కూడా ఎట్లా భ్రమా తెలయపర్చేవాడ్ని.

అప్పటికి కొద్దిగా వూరుకునే వాడు. మర్నాడు మళ్లీ యథాప్రకారంగా వాదించేవాడు.

ఒకరోజు సాయంత్రం పార్కులో బలవంతం చేసితనకి గల నిరూపణల్ని చెప్ప మన్నాను.

"నేను నమ్ముతున్నాను, అంతే" అన్నాడు మొండిగా.

కాని చివరికి తక్కువ స్వరంతో మొదలుపెట్టి చెప్పసాగాడు. నేనుకూడా అతని సీరియస్‌నెస్‌ని అడ్డకుండా, శ్రద్ధగా వినండి మొదలు పెట్టాను.

"నేను అట్లా అనుకోవడానికి, నీ వాదనల్ని తలకెక్కించుకో లేకపోవడానికి గల కారణం ఒక్కటే. దానికి నా చరిత్రే ఆధారం".

గొంతుకలో జీరవొస్తుంటే కంఠం సవిరించుకున్నాడు.

"ఇరవయ్యో శతాబ్దంలో సగందాదాపు గడిచినా, ఇంకా కుల బేధాలు సమయని భారత దేశంలో జన్మించినందుకు నేను పొందే బాధ చెప్పడానికి మాటలు చాలవు.

"నా మాట అట్లావుంచు. మా నాన్న! ఆయన నాకు కొందదారి సరిచేసినా నాకీదురవస్థ తప్పటంలేదు. ఆయనెంత కష్టపడ్డాడో? పాపం? నాకు ఆ గాథ తల్చుకున్నప్పుడల్లా మనస్సు తరుక్కుపోతుంటుంది".

ఇక్కడ కాసేపు ఆగి, మళ్లా అందుకున్నాడు:

"చిన్నప్పుడు ఆడుకునే పిల్లలల్లో, చదువుకునేటప్పుడు హాస్టల్లో, పెళ్ళిచేసుకునే విషయంలో, తర్వాత జీవితంలో మా నాన్న తరం కాదనుకుంటాను. ఆయన ఒక్కొక్క సమయంలో కూచుని గంటలతరబడి లోలోపల కుమిలి దు:ఖంచేవారు.

"ఆ దృశ్యాలు ఇప్పటికీ, ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన చేసిన పాపం తక్కువ కులంలో జన్మించడం. ఆయన యే విధంగానూ బాధ్యుడు కాని ఆయన పుట్టుకని గురించి రంపపుకోతకి బలి అవడం ఏమంత న్యాయం?

"ఇప్పుడు నా జీవితం అంతే! ఎవళ్ళో నీ వంటి వారు తప్ప అతి సున్నితమైన నా మనస్సుని నిర్దాక్షిణ్యంగా కష్టపెట్టేవాళ్ళు ఎంతమంది లేరని! అవును. ఇతరుల్ని పీడించడం కొందరు మానవులు వింత ఆటగా భావిస్తారు; ఆనందిస్తారు. కొందరికి అదే వృత్తికూడా వాళ్ళజోలు మనకెందుకులే.

"ఇంతవరకూ జరిగిన నా జీవితపు పుటలు తిరగవేసి చూసుకుంటే మా నాన్న అనుభవించిన కష్టాల వంటి కష్టాల సంఘటనలతో కూడిన గాథలే కనిపిస్తాయి.

"ముఖ్యం పెళ్లి విషయం. ఎంత చదువుంటేనేం? ఎంత విశాల హృదయుడవుతేనేం? తక్కిన ఉన్నత లక్షణాల కంటె కులం అధికతమమైంది... వాళ్లకి!– లోకోద్ధారకుల్లా మాట్లాడుతారుమళ్లా. అందుకే మనసులోనే కుళ్ళి, ఆశయాన్ని స్వహస్తంతోనే తుంచేసుకొని అజ్ఞాతపు జీవితాన్ని గడపడానికి సిద్ధమవవల్సి వొచ్చింది మా నాన్న.

"మధ్య ఇన్నాళ్ళు జరిగినా నా స్థితి కూడా అదే దారిలో నడిచేలా వుంది. ఈ వున్నత కులస్థుల మనుకునే హృదయ శూన్యులు కొంచపర్చినప్పుడు ఆత్మహత్య చేసుకుందామా అనిపిస్తుంది" అని ముగించాడు కేశవరావు.... ఇది జరిగిన రెండేళ్లకే తను బి.ఎ. చదువుతున్నప్పుడు, తన్ని ప్రేమించిన బ్రాహ్మణుల అమ్మాయితో వివాహం జరిగి, తన నమ్మకాన్ని మార్చకపోతే, ఇంకా "చరిత్ర పునరావృత మౌతుందనే నమ్ముతూ వుండును అతను.

అతని పెళ్లికినే పంపిన సందేశం: "చరిత్ర పునరావృతమవదు" అని.